క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన



వీపనగండ్ల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక విద్యకు అంగన్‌వాడీ కేంద్రాలు నిలయాలని, ఈ కేంద్రాల్లో పసిపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అదృష్టమని పలువురు అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే సౌకర్యాలను చిన్నారుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎల్లమ్మ, మహేశ్వరి, ఆయాలు లచ్చమ్మ, నీరజ, చిన్నారులు పాల్గొన్నారు.

రామాలయంలో కలశ ప్రతిష్ఠాపన



మదనాపురం: దుప్పల్లి గ్రామంలోని రామాలయంలో బుధవారం ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాముడు, సీతాదేవి, ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం కలశం ప్రతిష్ఠాపన వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య కొనసాగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, పండితులు వేంకటేశ్వరచార్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని ముందరితండా మాజీ ఉప సర్పంచ్ రమేష్‌నాయక్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జిల్లాలో మంత్రి నిరంజన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్శితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు రమేష్‌నాయక్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించి తండాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, రాజాప్రకాష్‌రెడ్డి, మన్నెపురెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'వివరాలు చెప్పే వరకు పనులు జరగనివ్వం'

గోపాలపేట: బుద్దారం రిజర్వాయర్ పూర్తి వివరాలు చెప్పేవరకు పనులు జరగనిచ్చే అవకాశమే లేదని బుద్దారం ప్రజలు, రైతులు స్పష్టం చేశారు. బుద్దారం రిజర్వాయర్ నిర్మాణం పనుల్లో భాగంగా ప్రారంభమైన ఒండ్రుమట్టి తరలింపు పనులను రైతులు వరుసగా మూడోరోజు బుధవారం సైతం అడ్డుకున్నారు. ప్రాజెక్టు డీఈ గఫార్ బుద్దారం గ్రామానికి చేరుకున్న తర్వాత రిజర్వాయర్ నిర్మాణంలో ప్రస్తుతం ఉన్న చెరువులో ఉన్న భూమి కాకుండా ఎన్ని ఎకరాల భూమి పోతోంది, దానికి ప్రభుత్వం ఏ ప్రామాణికంగా నష్టపరిహారం ఇస్తారని గ్రామస్తులు డీఈని నిలదీశారు. పూర్తి వివరాలు తొందర్లోనే గ్రామస్తులందరికీ చెప్పి పూర్తి స్థాయిలో పనులు చేపడతామని ఆయన తెలిపారు.

గట్టుకాడిపల్లిలో ప్రత్యేక పూజలు



వనపర్తి: ఖిల్లాఘనపురం మండలంలోని గట్టుకాడిపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి ఆలయానికి ప్రతి నెల 7వ తేదీన మండలం నుంచి ఎంతో మంది భక్తులు వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకుంటున్నారు. అదేవిధంగా స్వామివారు స్వయంభుగా వెలిసిన గట్టుకాడిపల్లి ఆలయానికి మండలంలోని పలు గ్రామాలతో పాటుగా వనపర్తి తదితర పట్టణాల నుంచి భక్తులు ప్రతి నెల 7వ తేదీన వచ్చి దర్శనం చేసుకుంటున్నారు. ఆలయ కమిటీ వారు భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని 7వ తేదీన ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

అంధకారంలో ఆత్మకూర్

ఆత్మకూర్: చిన్నపాటి వర్షం వచ్చిందంటే చాలు గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఆత్మకూర్‌లో సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే అధికారులు విద్యుత్ సరఫరను నిలిపేశారు. రాత్రి 10 గంటలైన విద్యుత్ సరఫరాను పునరుద్ధీకరించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా విద్యుత్ సరఫరాలో అవంతరాయం గురించి తెలుసుకునేందుకు ఫోన్లు చేస్తే అధికారులందరూ సెల్ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

పాన్‌గల్: నాణ్యమైన విద్య కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని దావాజిపల్లి, చింతకుంట, మల్లాయిపల్లి గ్రామాల్లో బడిబాట ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. 'మన ఊరు-మన బడి' పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులను కల్పిస్తున్నారని స్పష్టం చేశారు. పాఠ్య, రాత పుస్తకాలు, దుస్తులు, రుచికరమైన భోజనం వంటివి ప్రభుత్వం అందిస్తున్నట్లు ఆయన తల్లిదండ్రులు, విద్యార్థులకు వివరించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బద్రూనాయక్, ప్రభాకర్, ఉపాధ్యాయ బృందం, సీఆర్పీలు పాల్గొన్నారు.



దావాజిపల్లిలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని కొత్త సూగూర్‌లో జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, మండల విద్యాధికారి జయరాములు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు అందిస్తున్నారని అవగాహన కల్పించారు.

పెబ్బేర్‌రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన బడిబాటలో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులపై అవగాహన కల్పించారు.



శ్రీరంగాపురంలో..



పెబ్బేరులో..

తహసీల్దార్ చొరవతో దర్గా మరమ్మతు

అమరచింత: పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై వెలసిన శ్రీసయ్యద్ షా రాజావళీ దర్గా మరమ్మతు పనులను తహసీల్దార్ చాంద్‌పాషా చొరవతో బుధవారం ప్రారంభించారు. 20 రోజుల కిందట వీచిన గాలివానకు చెరువు కట్టపై ఉన్న దర్గాపై భారీ చెట్టు విరిగిపడటంతో దర్గా వెనక భాగం దెబ్బతింది. చెరువుల పండుగ సందర్భంగా చెరువు పరిసరాలను పరిశీలించడానికి వచ్చిన తహసీల్దార్‌కు రాజావళీ దర్గా పెచ్చులూడి ఉండటం గమనించి వెంటనే తన సొంత డబ్బులతో దర్గా మరమ్మతు పనులు చేయడానికి సిద్ధమయ్యారు. తాపీమేస్త్రీలను పిలిపించి దర్గా మరమ్మతు పనులను చేపట్టాలని ఆదేశించడంతో నిర్మాణ పనులు మొదలయ్యాయి.



మరమ్మతు చేస్తున్న కార్మికులు

లబ్ధిదారుల ఎంపికకు ఇంటింటి సర్వే



దరఖాస్తుదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్‌ఐ, వీఆర్‌ఏ

అమరచింత: మండలంలోని నందిమళ్ల గ్రామంలో నిజమైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నామని తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. డీటీ అనురాధ, ఆర్‌ఐ గోపాల్ ఆధ్వర్యంలో బుధవారం నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గతంలో ఇంటి స్థలాల కోసం దరఖాస్తు పెట్టుకున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకుంటున్నామని తెలిపారు. 1994లో గ్రామంలో నిరుపేదలకు ఇంటి స్థలాలను ఇవ్వడానికి ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసిందన్నారు. అప్పటి నుండి పట్టాల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో మారోమారు లబ్ధిదారుల సేకరణతో పాటు లేఅవుట్ చేసి.. ప్లాట్లుగా విభజిస్తామని తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను కలెక్టర్‌కు త్వరలో నివేదిస్తున్నామన్నారు.

మసీద్ కమిటీ ఉపాధ్యక్షుడి మృతికి సంతాపం

అమరచింత: పట్టణంలోని జామీయా మసీద్ కమిటీ ఉపాధ్యక్షుడు నిమ్మకాయల ఖదీర్ (48) ఆకస్మికంగా మృతి చెందడం తీరని లోటని జామీయా మసీద్ కమిటీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ తెలిపారు. మజీద్ అభివృద్ధిలో చురుకుగా పాల్గొనే ఖదీర్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం కర్నూల్‌కు వెళ్లిన ఖదీర్ సాయంత్రం ఆత్మకూర్‌కు చేరుకున్నాడు. ఇంట్లోనే సాయంత్రం ఛాతిలో నొప్పి అంటూ ఒక్కసారిగా కుప్పకూలడంతో ఖదీర్‌ను మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేక పోయిందని తెలిపారు. మృతి చెందిన ఖదీర్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రఫీక్, అన్సార్, తౌఫిక్, మైను, పాషా, ఖాసీం, అల్తాఫ్, ఆశు, నిస్సార్ పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి



ఆత్మకూర్: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీహరి అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పి పతకాలు సాధించిన క్రీడాకారులకే రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం మహిళలపై వివక్ష చూపుతోందని బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయుడు, మైనొద్దీన్, దాసు, బాలకృష్ణ, బాలన్న, తులసీరాం, సత్యమ్మ, నవనీత, రఫిక భాను, స్వర్ణలత, మాధవి తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. భవనంలో రూ.20లక్షల వ్యయంతో కొత్తగా నిర్మిస్తున్న తరగతి గదుల పనులను పరిశీలించారు. జూనియర్ కళాశాల నిర్వహణ కోసం కల్పిస్తున్న వసతి, సౌకర్యాలపై ప్రిన్సిపాల్ జ్యోత్స్నను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పాఠశాల చుట్టూ ప్రహరీతో పాటు ఇతర వసతుల కల్పన కోసం అవసరమైన నిధులు కేటాయిస్తామని అన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

వనపర్తి టౌన్: ఏడు, ఎనిమిది నెలలుగా పేరుకుపోయిన ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవిప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆఫీస్ బేరర్స్ సమావేశానికి హాజరైన రవిప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు, బదిలీలు చేయట్లేదని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు సకాలంలో అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శిగా హనుమంతును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల కుటుంబానికి భరోసా ఇవ్వడానికి ప్రవేశపెట్టిన కుటుంబ సంక్షేమనిధి పథకంలో ఉపాధ్యాయులు చేరాలని, ఈ పథకంలోని సభ్యులు మరణిస్తే రూ. 5లక్షల ఆర్థికసాయాన్ని కుటుంబానికి అందిస్తామని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శులు వెంకటేష్, తిమ్మప్ప, చిరంజీవి, భగవంతు, వెంకటేశ్వర్లు, అగ్రిప్ప, రియాజ్, రాముగౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవిప్రసాద్‌గౌడ్

'డీసీహెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడున్న సురేష్

వనపర్తి: ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనంలో కోతలు విధించడంతో పాటుగా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న డీసీహెచ్‌ఎం డాక్టర్ రాజ్‌కుమార్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది తదితర కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కాకుండా వెంకటయ్య సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ వారు జీతాల్లో కోత విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్‌ఐలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై అనేకసార్లు వైద్యశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. యూనియన్ తరుపున ప్రశ్నిస్తే దూషిస్తున్నారని మండిపడ్డారు. ఎంతో మంది కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే అధికారులు అరికట్టాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం సస్యశ్యామలం

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం సస్యశామలం అయిందని ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం నిర్వహించిన సాగునీటి దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాగునీటి రంగంలో సాధించిన ప్రగతి బుక్‌ను ఆవిష్కరించారు. రైతు సంతోషంగా ఉంటే దేశం సంతోషంగా ఉంటుందని భావించిన కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. వలసలు నివారించేందుకే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారన్నారు. బీజేపీ నాయకులు వేసిన కేసుల వల్లే పనులు ఆలస్యంగా కొనసాగాయన్నారు. కేసీఆర్ ముందుచూపుతో కర్వెన ప్రాజెక్ట్ నుంచి నారాయణ పేటకు నీటిని తరలించే కాల్వ ద్వారా కోయిల్ సాగర్ ప్రాజెక్ట్‌కు లింకును కలిపి ఊకచెట్టువాగు ద్వారా జూరాల ఆయకట్టు కింద రెండవ పంటకు నీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాడన్నారు. ఇప్పటికే నియోజక వర్గానికి అధిక చెక్‌డ్యాంలు మంజూరు చేశారన్నారు. 22 పూర్తి కాగా మరో 9 మంజూరయ్యాయన్నారు. దీంతో నియోజకవర్గంలో 1.40 లక్షల ఎకరాలు అధికంగా సాగు అయ్యిందన్నారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, ఇరిగేషన్ ఈఈ ప్రతాప్‌సింగ్, డిప్యూటీ డీఈలు చందు నాయక్, గోపాలచారి, తహసీల్దార్ సువర్ణ రాజు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కస్తూర్బా'లో సమస్యలు పరిష్కరించాలి

పెబ్బేర్‌రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ అన్నారు. కస్తూర్బా విద్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి సమస్యలపై ఆరా తీశారు. విద్యాలయంలో నీటి వసతి కోసం సంపు, ట్యాంక్ కానీ లేక బాలికలు ఇబ్బందులు పడుతున్నారని, బాత్‌రూంల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో బాలికలు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తుందన్నారు. భవనం రిజర్వాయర్ సమీపంలో ఉండటంతో లోపలికి విష సర్పాలు వస్తున్నందున వెంటనే ప్రహరీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు భవనం ప్రారంభించి ఏడాది గడవకముందే నాసిరక నిర్మాణంతో గోడల పెచ్చులుడుతున్నాయని ఆరోపించారు. ఆయా సమస్యలను డీఈకి ఫోన్ ద్వారా జెడ్పీటీసీ వివరించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కంభాళాపూర్ ఎంపీటీసీ ఎల్లస్వామి, రంజిత్, చందు, తోట రవి, నాయకులు స్వామి, పురుషోత్తంయాదవ్ పాల్గొన్నారు.



కస్తూర్బా విద్యాలయంలో సమస్యలపై ఆరా తీస్తున్న జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్

సంబరాలు కాదు.. మరమ్మతు చేయండి



ఆత్మకూర్‌లో ధ్వంసమైన జూరాల కాల్వను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: చెరువుల వద్ద సంబరాలు కాదు పూర్తిగా ధ్వంసమైన జూరాల కాల్వలకు మరమ్మతు చేయాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వినయ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూర్, అమరచింత మండలాల కాంగ్రెస్ నాయకులు జూరాల ప్రధాన ఎడుమకాల్వ, డీ 6 కాల్వలను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే కాల్వలకు మరమ్మతు చేయాల్సి ఉండగా ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారనంగా రెండేళ్లుగా మరమ్మతు చేపట్టకపోవడంతో నీరు వృథా అవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్య ధోరణిని వ్యవహరిస్తోందని, 75 కిలోమీటర్ల మేర ఉన్న జూరాల కాల్వ దిక్కుమొక్కు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రుణాలను వెంటనే మాఫీ చేయాలని, అకాల వర్షాల కారనంగా నష్టపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, తులసిరాజ్, పరమేష్, శ్రీనివాసులు, లక్ష్మీకాంత్‌రెడ్డి, భగవంతు, గంగాధర్, బుచ్చన్న, రైతులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటి కష్టాలు తీరాయి



సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: రాష్ట్రం ఏర్పడ్డాక ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు తీరాయని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో నీటిపారుదల శాఖ అధికారులు సాగునీటి దినోత్సవం నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు నీటిపారుదల శాఖ సీఈ ఎంఏ. హమీద్‌ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసగించారు. నియోజకవర్గానికి ప్రధాన జలవనరు అయిన కేఎల్‌ఐ ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. ప్రాజెక్టు ప్రారంభమైతే తాగునీటి సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం లభిస్తుందన్నారు. గోపల్‌దిన్నె-సింగోటం లింక్ కెనాల్‌కు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్దార్‌తిప్ప చెరువుకు కేఎల్‌ఐ నీటిని మళ్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస రెడ్డి, డీఈ అమర్‌సింగ్, మార్కెట్ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీపీలు బోజ్యానాయక్, కమలేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం ఖర్చు చేసి ఉత్సవాలా?

అమరచింత: ప్రజాధనంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో అభివృద్ధి పథకాలు తమ పార్టీ సాధించిన గొప్ప విజయంగా ప్రచారం చేసుకోవడం ఏంటని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి హనుమంతు ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని దుయ్యబట్టారు. పట్టణంలో బుధవారం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఆరోపించారు. రూ.ఐదు లక్షల కోట్ల అప్పులను ప్రజల నెత్తిన మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని చెప్పిన సీఎం కేసీఆర్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయడంలో విఫలమయ్యాడని మండిపడ్డారు. డబుల్ బెడ్‌రూంలు ఇవ్వడంలో ప్రజలను మోసం చేశారన్నారు.

ఊసే లేని రైతు రుణమాఫీ..

రైతులకు రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని మోసం చేశాడని, పోడు భూములకు పట్టాలిస్తానని చెప్పి కాలయాపన చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతూనే ఉన్నారని విమర్శించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను ఇవ్వలేక పోయారని, ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారని జోస్యం చెప్పారు. బంగారు తెలంగాణ అంటూ అందినంత దోచుకోవడమే పనిగా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పనిగా మారిందన్నారు. దీక్ష దివస్ సందర్భంగా ఈనెల 8న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, 12న జిల్లా కేంద్రంలో దీక్ష దివస్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి రాజు, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న, బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సామేలు, నాయకులు వెంకటేష్, రాజు, మురళి, జనార్దనమ్మ, శైలజ, మహేశ్వరమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ప్రజాపంథా నాయకులు

'చెరువుల పండుగ' పనుల పరిశీలన

వనపర్తి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మన ఊరు చెరువుల పండుగను ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఖిల్లాఘనపురం మండల కేంద్రంతో పాటు తదితర గ్రామాల్లో పర్యటించి చెరువుల పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించాలని ఆదేశించారు. గురువారం చెరువుల వద్ద పండుగ వాతావరణం కనిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే ఊరురా చెరువుల పండుగ పనులను బుధవారం మండలంలోని అన్నారంలో తహసీల్దార్ చక్రపాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ప్రతి గ్రామ పంచాయతీలోని పెద్ద చెరువుల వద్ద గురువారం నిర్వహించే చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలన్నారు. గ్రామం నుంచి డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారుల వలలతో సాయంత్రం ఊరేగింపుగా చెరువులకు బయలుదేరాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురం పిరంకాని చెరువు వద్ద పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వీపనగండ్ల: మండలంలోని ఆరు రైతు వేదికల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే చెరువుల పండగల కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని తహసీల్దార్ పాండూనాయక్, ఎంపీడీఓ కతలప్ప విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంతో పాటు కల్వరాల, పుల్గర్‌చర్ల, గోపల్‌దిన్నె, తూంకుంట, బొల్లారం గ్రామాల్లోని రైతు వేదికల ద్వారా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని, ఆటపాటల ద్వారా చెరువుల వద్ద తెలంగాణ సంస్కృతిని చాటాలని కోరారు.



అన్నారం చెరువు పరిసరాలను శుభ్రం చేయిస్తున్న తహసీల్దార్ చక్రపాణి